
ప్రకృతి ఆరాధన.. బతుకమ్మ
తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. 10లో


ఏజెన్సీలో హై అలర్ట్
మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 25°
వాతావరణం
జిల్లాలో ఆదివారం వాతావరణం చల్లగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి అంతరాలయంలోని మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామి వారిని పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయఅర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామయ్య సేవలో మాజీ క్రికెటర్ లక్ష్మణ్


రామాలయంలో వీవీఎస్ లక్ష్మణ్ కుటుంబీకులు

శ్రీసీతారామ చంద్ర స్వామివారిని శనివారం మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. తరువాత దేవస్థాన అనుబంధ ఆలయాలను సందర్శించగా అధికారులు ఆయనకు స్వామి వారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పీఆర్వో సాయిబాబు, వేదపండితులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం

పాల్వంచరూరల్: మాసశివరాత్రిని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శనివారం అమ్మవారి సన్నిధిలోని యాగశాలలో రుద్రహోమం జరిపారు. ముందుగా మేళతాళాలతో, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతిపూజ రుద్రహోమం చేశారు. చివరన పూర్ణాహుతి నిర్వహించారు.

డీఈపై ఈఎన్‌సీ ఆగ్రహం


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఈఎన్‌సీ మోహన్‌నాయక్

అశ్వారావుపేట: ఆర్అండ్‌బీ డీఈ ప్రకాశ్‌పై ఆ శాఖ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వారావుపేటలో ఏళ్ల తరబడి నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులను శనివారం రాత్రి ఆయన పరిశీలించారు. రహదారిపై డివైడర్ వంపు కనిపించడం లేదా అని మందలించారు. రింగ్ సెంటర్‌లో బయటివైపు రోడ్డు వాలి నిర్మించడం వల్ల వాహనాలు పడిపోతున్నాయని పేర్కొన్నారు. భద్రాచలం రోడ్‌లో కిలోమీటరు రహదారి విస్తరణ పనులు ఎంతకాలం చేస్తారని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. బీటీ రహదారిని నిర్మించాకే సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఇతర పనులు చేపట్టాలని సూచించారు. రహదారి నిర్మాణంలో లోపం వల్లే రింగ్ సెంటర్‌లో ఖమ్మం నుంచి రాజమండ్రి వెళ్లే వాహనాలు పల్టీ కొడుతున్నాయని అన్నారు. అత్యవసరంగా రింగ్‌లో సాంకేతిక లోపాన్ని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి నాటికి బీటీ పూర్తిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశించామన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఉషూ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలలు, జూనియర్ కళాశాలల క్రీడా సంఘాల సంయుక్త ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాస్థాయి బాలబాలికల అండర్-17, 19 ఉషూ జట్ల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు సంఘాల బాధ్యులు పి.వెంకటేశ్వర్లు, నరేష్‌కుమార్, ఎం.డీ.మూసా కలీం తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-17 విభాగంలో బాలబాలికలు 2009 జనవరి తర్వాత, అండర్-19 విభాగంలో 2007 జనవరి తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు వయసు ధ్రువపత్రాలతో పాటు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ తీసుకురావాలని, వివరాలకు 99481 99743, 98662 90609 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైతులు పంటల సాగులో నూతన ఒరవడి అవలంబిస్తున్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు, సకాలంలో పురుగుమందుల పిచికారీకి ట్రాక్టర్ స్ప్రేయర్లు వినియోగిస్తున్నారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందు పిచికారీ చేయగలుగుతున్నారు. పెస్టిసైడ్స్ కంపెనీలు సూచించిన పరిమాణంలో రసాయన మందులకు నీటిని కలిపి పంట చేలలో పిచికారీ చేయటంతో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. – బూర్గంపాడు


పత్తి చేలో ట్రాక్టర్ స్ప్రేయర్‌తో పురుగులమందు పిచికారీ చేస్తున్న రైతు

సాగులో సరికొత్తగా..

- పత్తి పంటలో ట్రాక్టర్లతో పురుగుమందుల పిచికారీ
- కూలీల కొరతను అధిగమిస్తున్న రైతులు
- సకాలంలో మందులు స్ప్రే చేసేందుకు అవకాశం
- మనుషులపై తగ్గనున్న రసాయనాల ప్రభావం

రెండేళ్లుగా పెరుగుతున్న వినియోగం

జిల్లాలో అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్నారు. ఈసారి సుమారు 2.20 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టారు. పత్తిని ఆశించే పురుగు, చీడపీడల, దోమ నివారణకు కనీసం ఎనిమిది నుంచి పదిసార్లు మందులు స్ప్రే చేయాల్సి వస్తుంది. కూలీల కొరత కారణంగా రైతులు సకాలంలో పురుగుమందులు స్ప్రే చేయలేకపోతున్నారు. దీనికితోడు స్ప్రే చేసిన కూలీలపై అప్పుడప్పుడు రసాయనాల ప్రభావం కూడా పడుతోంది. పలువురు కూలీలు అస్వస్థతకు గురైన, అక్కడక్కడా ప్రాణాలు పోయిన ఘటనలు



కూడా ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు రైతులు కొత్త పద్ధతులు వెతుకుతున్నారు. ఈ క్రమంలోనే ట్రాక్టర్‌కు స్ప్రేయర్లు బిగించి పత్తిలో మందులు పిచికారీ చేస్తున్నారు. ఐదారేళ్ల క్రితం నుంచి ట్రాక్టర్ స్ప్రేయర్లతో మందులు పిచికారీ చేస్తున్నా, రెండేళ్లుగా వీటి వినియోగంగా బాగా పెరిగింది. జిల్లాలో ఈ ఏడాది చాలా గ్రామాల్లో రైతులు ట్రాక్టర్ స్ప్రేయర్లతో మందులు పిచికారీ చేస్తున్నారు. పురుగు, తెగుళ్ల, దోమ ఉధృతిని గుర్తించగానే మందులు సకాలంలో పిచికారీ చేసుకుంటున్నారు. గతంలో కూలీలు దొరికేవరకు ఆలస్యమైతే పంట నష్టం జరిగేది. ఇప్పుడా ఆందోళన లేదు.

నిర్దేశిత మోతాదులో..

పెస్టిసైడ్స్ కంపెనీలు తమ ఉత్పత్తులను పంటలపై పిచికారీ చేసేటప్పుడు సూచించే పరిమాణంలో రైతులు నీటిని వినియోగించలేకపోతున్నారు. నీటి మోతాదు తక్కువ అవుతుండటంతో మొక్కలు పూర్తిగా తడవటం లేదు. అదే ట్రాక్టర్ స్ప్రేయర్లతో మందులు పిచికారీ చేస్తే కంపెనీలు సూచించిన మోతాదు నీటిని కలిపి మొక్కలు పూర్తిస్థాయిలో తడుపుతున్నారు. దీంతో పురుగు, దోమ, తెగుళ్ల ఉధృతిని కట్టడి చేయగలుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కూలీల అవసరం లేకుండా టాక్టర్ స్ప్రేయర్లతో మందులు పిచికారీ చేయడంతో పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయని పేర్కొంటున్నారు.

రోజూ 40 ఎకరాల్లో పిచికారీ..

ట్రాక్టర్ స్ప్రేయర్‌తో రోజూ 40 ఎకరాల వరకు పత్తికి మందులు పిచికారీ చేస్తున్నారు. అదే పని ని కూలీలతో చేస్తే నాలుగు రోజులు పడుతుంది. కూలీల ఖర్చు తగ్గటంతోపాటు సమ యం కలిసివస్తుంది. దీంతో రైతులు ట్రాక్టర్ స్ప్రేయర్లపై మక్కువ చూపుతున్నారు. ట్రాక్టర్‌కు స్ప్రేయర్‌ను బిగించుకునేందుకు రూ.70వేల వరకు ఖర్చవుతుంది. కూలీల ఖర్చులతో పోల్చుకుంటే రైతులకు ఎకరాకు రూ. 8వేల వరకు ఆదా అవుతుంది. జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, దు మ్ముగూడెం, గుండాల, ములకలపల్లి, టేకులపల్లి మండలాల్లో రైతులు ప్రస్తుతం ట్రాక్టర్ స్ప్రేయర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ స్ప్రేయర్లు కొనలేని రైతులు కిరాయి ఇచ్చి మందులు పిచికారీ చేయిస్తున్నారు. ఎకరాకు రూ. 150 నుంచి రూ.200 వరకు కిరాయి వసూలు చేస్తున్నారు. ఇద్దరు కూలీలతో రోజుకు ఆరు, ఏడు ఎకరాల వరకు మందు పిచికారీ చేయవచ్చు. వారికి కూలి రూ.1500, స్ప్రేయర్ పెట్రోలుకు రూ. 300, మొత్తం రూ. 1800 ఖర్చవుతుంది. అదే ట్రాక్టర్‌తో స్ప్రే చేస్తే ఆరు, ఏడు ఎకరా లకు రూ.1000 మాత్రమే ఖర్చు వస్తుంది. మందు పిచికారీ కూడా గంటన్నరలో పూర్తవుతుంది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ట్రాక్టర్ స్ప్రేయర్లతో తొందరగా మందుల పిచికారీ జరుగుతోంది.

సకాలంలో మందులు కొడుతున్నాం



ట్రాక్టర్ స్ప్రేయర్‌తో మందులు సకాలంలో కొట్టగలుగుతున్నాం. చేలో పురుగు ఉందంటే వెంటనే ట్రాక్టర్‌తో వెళ్లి మందులు కొడుతున్నాం. అదే కూలీలతో చేయించాలంటే వారు దొరకక ఇబ్బందులు పడాలి. ఖర్చు కూడా సగానికి సగం తగ్గుతుంది.
–యడమకంటి రవీందర్‌రెడ్డి, రైతు, రెడ్డిపాలెం

కూలీలతో ఇబ్బందులు పడలేక..



పత్తిచేలలో మందులు కొట్టేందుకు కూలీలు దొరకటం లేదు. స్థానికంగా దొరకకపోవటంతో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన కూలీలతో మందులు కొట్టించుకోవాల్సి వస్తుంది. వారికి మందులు కొట్టడం పెద్దగా తెలియదు. ఈ ఇబ్బందులు పడలేక ట్రాక్టర్ స్ప్రేయర్లతో మందులు కొట్టిస్తున్నాం.
–పాలం లక్ష్మిరెడ్డి, రైతు, నాగినేనిప్రోలు

పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యం

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు

బూర్గంపాడు/అశ్వాపురం: ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టడం ఆవశ్యమని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు తెలిపారు. బూర్గంపాడు మండలంలో నాగినేనిప్రోలు ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని (పూర్వ ప్రాథమిక పాఠశాల)ను శనివారం ఆయన కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే కార్యకలాపాలపై ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న కృత్రిమ మేధ(ఏఐ) తరగతులను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ తరగతుల నిర్వహణకు


ఏఐలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ సుబ్బారావు, కలెక్టర్ జితేష్

చర్యలు తీసుకోవాలని సూచించారు. అశ్వాపురం మండలం నెల్లిపాకలో మునగతోటను పరి శీలించారు. ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. అధికారులు మృణాల్ శ్రేష్ఠ, సౌరభ్ శర్మ, విద్యాచందన, నాగలక్ష్మి, నాగరాజశేఖర్, సతీష్‌కుమార్, సైదులు పాల్గొన్నారు.

న్యాయవాదులు అధ్యయనం చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: న్యాయవాదులు కేసులు గెలవాలంటే నిత్య విద్యార్థిగా అధ్యయనం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. శనివారం జిల్లాకోర్టు ఆవరణలోని లైబ్రరీ హాల్‌లో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మ్యాండేటరీ నోటీస్ ప్రాధాన్యతను వివరించారు. న్యాయమూర్తులు కె. కిరణ్‌కుమార్, కర్నాటి కవిత, కె.సాయిశ్రీ, బి.రవికుమార్, సీనియర్ న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, కొల్లి సత్యనారాయణ, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, రమేష్, కె.పురుషోత్తంరావు, జే.శివరాం పాల్గొన్నారు.

వయోజన విద్యకు సిద్ధం

- జిల్లాలో 38,301 మంది నిరక్షరాస్యుల గుర్తింపు
- 964 మంది ఆర్‌పీలు, 3,831 మంది వలంటీర్లకు శిక్షణ
- త్వరలో గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించనున్న అధికారులు

ఇల్లెందు: పదేళ్లుగా అటకెక్కిన వయోజన విద్యాబోధనను మళ్లీ ప్రారంభించనున్నారు. నిరక్షరాస్యులను గుర్తించి అక్షరజ్ఞానం కల్పించనున్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఎంపిక చేసిన వలంటీర్లు, ఆర్పీలు, డీఆర్పీలకు శిక్షణ పూర్తిచేశారు. త్వరలోనే గ్రామాల్లో విద్యా కేంద్రాలను ప్రారంభించి గుర్తించిన వయోజనులకు బోధన చేపట్టనున్నారు.

964 పాఠశాలల ఎంపిక

జిల్లాలో 22మండలాల్లో 964 పాఠశాలల్లో వయోజన విద్య కార్యక్రమం అమలు చేయనున్నారు. జిల్లాస్థాయిలో డీఆర్‌పీలకు, మండల స్థాయిలో 964మంది ఆర్‌పీలు, గ్రామస్థాయిలో 3,831మంది వలంటీర్లకు శిక్షణ పూర్తి చేశా రు. బోధనకోసం వలంటీర్లకు మార్గదర్శిని అనే పుస్తకాలు కూడా అందించారు. జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులు 38,301 మంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వీరికి విద్య నేర్పేందుకు వయోజన విద్య కార్యక్రమం అమలు కోసం ఒక్కో మండలానికి


వయోజన విద్య పుస్తకాలను చూపుతున్న అధికారులు (ఫైల్)

ఇద్దరు ఉపాధ్యాయులను, మండల రిసోర్స్ పర్సన్స్ ఎంపిక చేశారు. గ్రామస్థాయిలో డ్వాక్రా గ్రూపు సభ్యుల సహకారం కూడా తీసుకోనున్నారు. వయోజనుల కోసం 38,301 అక్షర వికాసం అనే పుస్తకాలు, బ్రోచర్లు కూడా మండల కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

రోజూ గంటన్నరపాటు

వలంటీర్లు రోజూ సాయంత్రం గంటన్నరపాటు వయోజనులకు బోధించాల్సి ఉంటుంది. మూడు నెలల్లో కేటాయించిన వాచకాలను బోధించి వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉంది.ఇందుకోసం వలంటీర్‌కు పారితోషికం కూడా చెల్లిస్తారు. శిక్షణ కాలంలో వలంటీర్లకు టీ, స్నాక్స్, భోజనవసతి వంటి సదుపాయాలు కూడా కల్పిస్తారు. ఆతర్వాత మూల్యాంకనంచేసి వయోజనులు ఏ మేరకు విద్య నేర్చుకున్నారో అంచనా వేయాల్సి ఉంటుంది. వయోజన బోధనకోసం మూడంచెల పద్ధతి అనుసరిస్తున్నారు. తొలి విడతలో మార్గదర్శిని, అక్షర వికాస్ ద్వారా బోధించాలి. దీనినే అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్)గా పేర్కొంటున్నారు. నవభారత్ సాక్షరతా కార్యక్రమం లో 'చదువుకుందాం రండి.. చదువు నేర్పుదాం పదండి'అంటూ శిక్షణ మాన్యువల్‌లో సూచించారు.

పనుల కాలంలో బోధన సాగేనా?

ముమ్మరంగా వ్యవసాయ పనులు సాగుతున్న, యూరియా దొరకక రైతులు అల్లాడుతున్న తరుణంలో వయోజన విద్యా కార్యక్రమం ముందుకు సాగేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నిర్వహించిన అక్షర దీపం తరహాలో ఈ కార్యక్రమం ఉద్యమంలా సాగితేనే ప్రతిఫలాలు లభిస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

షెడ్యూల్ కోసం వేచి చూస్తున్నాం..



వయోజన విద్య ప్రారంభానికి శిక్షణ పూర్తయింది. గ్రామాల వారీగా నిరక్షరాస్యులైన వయోజనులల వివరాలు సేకరించి వలంటీర్లను నియమించారు. కేంద్రాలు ప్రారంభించి బోధన చేపట్టాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి షెడ్యూల్ కోసం వేచి చూస్తున్నాం.
– మిడియం దుర్గారావు, మండల పర్యవేక్షకుడు, ఇల్లెందు

సకాలంలో రుణాలు ఇవ్వాలి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి జిల్లాలోని బ్యాంకర్లు, ఇతర అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్ష నిర్వహించారు. రైతుల రుణాల పంపిణీ, స్వశక్తి సంఘాల రుణాల రికవరీ, పీఎం స్వానిధి రుణాలు, ఎఫ్‌పీఓల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం రూ. 2,291 కోట్ల పంట రుణాల లక్ష్యానికి సెప్టెంబర్ చివరివరకు రూ.409.55 కోట్లు, రూ.1,416.09 కోట్ల వ్యసాయ టర్మ్ రుణాల లక్ష్యానికి రూ.342.31 కోట్ల రుణాలు అందించామని వివరించారు. తక్కువ పంట రుణాలు అందించిన బ్యాంకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న మూడు నెలల కాలంలో 500 యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు సహకరించాలని ఆదేశించారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఎస్పీ రోహిత్‌రాజు, భద్రాచలం


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు.

పోషణ మాసోత్సవాలు విజయవంతం చేయాలి

జిల్లాలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు నిర్వహించే పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో నిర్వహించే సురక్షిత, పోషణ, ఆరోగ్యం కార్యక్రమంపై సంబంధిత శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎల్‌బీఎం రామ్‌రెడ్డి, మెప్మా పీడీ రాజేష్, నాగలక్ష్మి, స్వర్ణలత లెనీనా, జయలక్ష్మి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో ప్రయోజనాలు

కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ, ఇతర పనుల్లో సాంకేతిక పరికరాల వాడకం పెరుగుతోందని, డ్రోన్ టెక్నాలజీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. శనివారం కళాశాల విద్యార్థులకు డ్రోన్లు, డ్రోన్ పైలెట్‌గా ఉద్యోగ, వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాలలోని పొలాల్లో సాగు చేస్తున్న వరి, పత్తి పంటలకు పురుగుల మందులు, ఎరువులను డ్రోన్ సాయంతో పిచికారీ చేయించి నేరుగా విద్యార్థులకు చూపించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ పురుగు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

మందుల పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగించడం వల్ల మనుషులకు ముప్పు ఉండదన్నారు. అధ్యాపకులు రాంప్రసాద్, నాగాంజలి, నీలిమ, జెమిమా, డి.స్రవంతి, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటుపై పరిశీలన


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ మోహన్‌రావు

భద్రాచలం అర్బన్/మణుగూరు రూరల్: మణుగూరు మండలంలోని వైఎస్ఆర్‌నగర్‌లో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై విద్యుత్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి.మోహన్‌రావు శనివారం పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని వైఎస్ఆర్ నగర్‌వాసులు ఫిర్యాదులు ఇచ్చిన నేపథ్యంలో డైరెక్టర్ ప్రాంతాన్ని పరిశీలించారు. సోలార్ విద్యుత్, స్తంభాలు, లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. భద్రాచలం విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో మొక్కలు నాటారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డైరెక్టర్‌ను అధికారులు సన్మానించారు. ఎస్ఈ మహేందర్, డీఈలు జీవన్‌కుమార్, వెంకటేశ్వర్లు ఏడీఈలు వేణు, ఉమారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి

దుమ్ముగూడెం: బండిరేవు గ్రామంలో నిర్మిస్తు న్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం పర్ణశాల గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను, బండిరేవు గ్రామంలో నిర్మిస్తున్న నూతన సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.1.96లక్షలతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పర్ణశాల శ్రీ సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు చేశారు. అధికారులు జీవన్, వెంకటేశ్వర్లు, యాసిన్, ప్రభాకర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ పొందాలి

భద్రాచలంటౌన్: బాలికలు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ పొందాల ని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్షల్ ఆర్ట్స్ ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం 15 రోజులపాటు ఆత్మరక్షణ శిక్షణ తీసుకున్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, రఘు సుమా, హవేల, హిమజ, కపిల భారతి, సమీరా, శ్రీలత, రేవతి, పూర్ణిమ, కల్పన, శరణ్య, పావని, భవాని పాల్గొన్నారు.


క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నపురెడ్డిపల్లి, (చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో వేంచేసిఉన్న శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి క్రతువు జరిపించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. పూజాది కార్యక్రమాలను దేవస్థానం ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు నిర్వహించగా, కల్యాణ ఏర్పాట్లను ఆలయ మేనేజర్ టీవీ రమణ పర్యవేక్షించారు.

కిన్నెరసాని గేటు ఎత్తివేత


గేటు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలయాశానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 600 క్యూసెక్కుల వరదనీరు రావడంతో శనివారం నీటిమట్టం 406.20 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తి 2 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

23న దసరా అడ్వాన్స్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 23న కార్మికులకు దసరా అడ్వాన్స్ చెల్లించనున్నట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. పండుగ సందర్భంగా కార్మికులకు రూ.25 వేల అడ్వాన్స్ ఇచ్చి, పది సమాన వాయిదాల్లో రికవరీ చేస్తామని తెలిపింది . నగదును 23న బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొంది.

సింగరేణి అధికారుల బదిలీ

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి మైనింగ్ విభాగంలో 31 మంది అధికారులను బదిలీ చేస్తూ శనివారం ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సెల్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. బదిలీఅయిన వారిలో ఏజీఎం మొదలు కొని మేనేజర్‌స్థాయి వరకు ఉన్నారు. ఈనెల 27వ తేదీలోగా కేటాయించిన స్థానాల్లో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనాల పట్టివేత


పోలీసులు పట్టుకున్న వాహనాలు

చండ్రుగొండ: మూడు బొలేరో వాహనాల్లో అక్రమంగా పశువులను తరలిస్తుండగా మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శివరామకృష్ణ ఆద్వర్యంలో జాతీయ రహదారిపై పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఐదు ఆవులు, మూడు కోడె దూడలను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు వ్యక్తుల నుంచి ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుజాతనగర్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సుజాతనగర్ ఎస్‌ఐ ఎం.రమాదేవి శనివారం పట్టుకున్నారు. బేతంపూడి శివారులో అనుమతులు లేకుండా ఇసుక తోలుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. ఈ మేరకు రెండు ట్రాక్టర్లను పట్టుకొని కుంజా జీవన్, జబ్బ విజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సుజాతనగర్: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. జూలూరుపాడు మండలానికి చెందిన కొమ్మినేని నాగేశ్వరరావు స్థానిక భవాని రైస్ మిల్లు ఎదురుగా 7 క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో రవాణా చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని బియ్యం నిల్వలను సీజ్ చేశారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.రమాదేవి తెలిపారు.

పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ దేశ్యాతండాకు చెందిన బానోత్ రాంజీ మద్యం మత్తులో శనివారం పురుగులమందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఖమ్మంకు సిఫార్సు చేయగా.. కుటుంబ సభ్యులు తరలించారు.

ప్రకృతి ఆరాధన.. బతుకమ్మ

- ఎంగిలిపూలతో ప్రారంభమై సద్దులతో ముగియనున్న వేడుకలు
- బతుకమ్మ నైవేద్యాలూ ప్రత్యేకమే..
- ఆనందోత్సాహాలతో ఆడి, పాడనున్న ఆడబిడ్డలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

కొత్తగూడెంటౌన్/పాల్వంచరూరల్: స్త్రీ శక్తిని గౌరవించే పండుగ.. ప్రకృతిని ఆరాధించడమే.. బతుకమ్మ పండుగ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ పండుగ ప్రతీక. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలో ఇమిడి ఉంటుంది. ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను జరుపుకోవటం ఆనవాయితీ. గౌరి పండుగ, సద్దుల పండుగ, పూల పండుగగా పిలుచుకుంటారు. మహాలయ అమావాస్య ఆదివారం నుంచి ప్రారంభమయ్యే పండుగ దుర్గాష్టమితో ముగుస్తుంది. తెలంగాణ గ్రామీణ సమాజంలో నవాబులు, భూస్వాముల పెత్తందారీలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. ఆ అకృత్యాలకు ఆత్మహత్య చేసుకున్న మహిళలను తలుచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. పాటల వెనుక ఉండే మర్మం ఇదే అని ప్రజల విశ్వాసం. కాగా, తెలంగాణ ఆవిర్భావం తరువాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పండుగకు ప్రాధాన్యత పెరిగింది. గతంలో కొన్ని చోట్ల మాత్రమే బతుకమ్మ ఆడేవారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత వాడవాడనా ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

తొమ్మిది రోజుల పండుగ

బతుకమ్మ పండుగకు పుష్పాలే కళ. వానాకాలం చివరిలో శీతాకాలం ఆరంభంలో ఈ పండుగ వస్తుంది. ఈ సమయంలో నీటితో నిండిన జలాశయాల్లో తామర, కలువ వంటి పూలు లభిస్తాయి. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, నంది వర్ధనం పూలు పూస్తాయి. సీతా ఫలాలు లభిస్తాయి. జొన్న పంట కోత సమయం. ఆడబిడ్డలు అత్తవారి ఇంటి నుంచి కన్న వారింటికి వచ్చి ఈ బతుకమ్మ పండుగను జరుపుకోవటం ప్రత్యేకత. తొమ్మిది రోజుల పాటు నిత్యం ఓ రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు నైవేద్యం తయారీలో యువతీ, యువకులు పాల్గొంటారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ రోజున మహిళలు మాత్రమే నైవేద్యాన్ని తయారు చేస్తారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై.. సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది.

➡ **ఎంగిలి పూల బతుకమ్మ:** మహా అమావాస్య నుంచి ఎంగిలిపూల బతుకమ్మగా వేడుకలు ప్రారంభమవుతాయి. పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

అటుకుల బతుకమ్మ: ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

➡ **ముద్దపప్పు బతుకమ్మ:** ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

➡ **నాన బియ్యం బతుకమ్మ:** నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేసి సమర్పిస్తారు.

➡ **అట్ల బతుకమ్మ:** అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

➡ **అలిగిన బతుకమ్మ:** ఆశ్వయుజ పంచమి రోజున నిర్వహించే ఈ రోజున ఏ నైవేద్యాన్ని తయారు చేసి సమర్పించరు.

➡ **వేపకాయల బతుకమ్మ:** బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

➡ **వెన్నముద్దల బతుకమ్మ:** నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

➡ **సద్దుల బతుకమ్మ:** ఆశ్వయుజ అష్టమి. ఈ రోజున దుర్గాష్టమిని జరుపుకుంటారు. 5 రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింత పండు పులిహోర, నిమ్మకాయ కలిపిన అన్నం, కొబ్బరన్నం, నువ్వులన్నం. తొమ్మిది రోజులు సమర్పించే నైవేద్యాలలో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసలు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు.

సంతోషంగా జరుపుకుంటాం


ప్రతి ఏడాది బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకుంటాం. తొమ్మిది రోజుల పాటు ఆటపాటలతో మా ప్రాంతం సందడిగా ఉంటుంది. పూల సేకరణ, బతుమ్మ పేర్చడం అంటే ఎంతో ఇష్టం. పూలను ఆరాధించే ఈ పండుగ ఇది ఒక్కటే. ఈ పండుగ వేళ బంధు మిత్రులను కలుసుకుని సంతోషంగా గడుపుతాం. –కంది భారతి, వనందాస్‌గడ్డ, రామవరం

రోజుకో రకంగా..


తొమ్మిది రోజుల పాటు రోజుకో విధంగా బతుకమ్మను పేర్చి పండుగను చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఆటపాటలతో జరుపుకుంటాం. రోజుకో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తాం. బయటకు వెళ్లి తంగేడు, గునుగు పూలను సేకరించి బతుకమ్మ పేర్చుతాం. స్నేహితులతో కలిసి పూల సేకరణ ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. –ఎ.ప్రియాంక, రామవరం

చిన్నతనం నుంచి ఆడుతున్నా..


నా చిన్నపటి నుంచి బతుకమ్మ అంటే ఇష్టం. ఎప్పుడు బతుకమ్మ పండుగ వస్తుందో అని ఎదురు చూసేదాన్ని. పండగ వచ్చిందంటే చెట్టు, పుట్టా తిరిగి తీరొక్క పూలు సేకరించుకుని కొత్తబట్టలు వేసుకుని సాయంత్రం సమయంలో బతుకమ్మను ఎత్తుకుని వెళ్లి ఆడుకునేదాన్ని. 40 ఏళ్లుగా బతుకమ్మ ఆడుతున్నాను. –చింతలపాటి పద్మ, నాగారం

స్నేహితులతో కలిసి..


నేను మా స్నేహితులతో కలిసి బతుకమ్మ ఆడుతాను. తొమ్మిది రోజులపాటు జరుపుకునే ఈ పండుగ మా ప్రాంతంలో సందడిని నింపుతుంది. మా ప్రాంతంలో పూలు విరివిగా దొరుకుతాయి. వాటిని సేకరించి, బతుమ్మ పేర్చి ఆడటం ఎంతో ఇష్టం. –మోకాళ్ల కవిత, కిన్నెరసాని

తెలంగాణ సంస్కృతికి ప్రతీక


ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతికి ప్రతీకగా ఈ ఈ పండుగ నిలుస్తుంది. పూలతో బతుకమ్మను అలంకరించి, ఆటపాటలతో వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీ. –దత్తాత్రేయశర్మ, అర్చకుడు, కొత్తగూడెం

ఏజెన్సీలో హైఅలర్ట్..

నేటి నుంచి మావోయిస్టు పార్టీ 21వ ఆవిర్భావ వేడుకలు


పెదమిడిసిలేరు సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల: ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సెప్టెంబర్ 21న మావోయిస్టు 21వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీలో హైఎలర్ట్ ప్రకటించారు. అటవీ ప్రాంతానికి పెద్ద ఎత్తున ప్రత్యేక పోలీసు బలగాలను తరలించి, కూంబింగ్ ముమ్మరం చేశారు. అటవీ ప్రాంత గ్రామాలకు వెళ్లే రహదార్లలో ప్రత్యేకంగా బలగాలను మోహరించి, తనిఖీలను నిర్వహిస్తున్నారు. మండలంలోని కుర్నపల్లి, పెదమిడిసిలేరు, ఉంజుపల్లి మార్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సరిహద్దు ప్రాంతాలకు చేరుకున్న సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలు ప్రతీ ఒక్కరినీ నిశితంగా పరిశీలిస్తున్నాయి. కొంతకాలం పాటు స్తబ్ధుగా ఉన్న మావోయిస్టులు మళ్లీ లేఖలు జారీ చేయడం, వాల్‌పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేయడంతో పోలీసు శాఖ మరింత అప్రమత్తమైంది. వ్యాపారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులతో పాటు అధికార పార్టీ నేతలను టార్గెట్ చేస్తూ రెండు రోజుల క్రితం లేఖ విడుదల చేసిన నేపథ్యంలో పలువురిని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని పోలీసులు ఆదేశాలిచ్చారు. ఎస్పీ, భద్రాచలం ఏఎస్పీల ఆదేశాల మేరకు చర్ల సీఐ రాజువర్మ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

అంబులెన్స్‌లో శిశువు జననం

- తొలుత మరోపాప జననం
- నెలలు నిండకుండా పుట్టడం, బరువు తక్కువగా ఉండటంతో ఖమ్మానికి తరలింపు


ఇద్దరు పాపలకు జన్మనిచ్చిన సంధ్య

ఇల్లెందు: అంబులెన్స్‌లో గర్భిణి ఓ పాపకు జన్మనిచ్చిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. అంతకు కొద్ది సమయం ముందే ఓ పాప పుట్టింది. ఈ ఇద్దరూ 7వ నెలలో పుట్టడం, బరువు తక్కువగా ఉండటంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఈర్యాతండాకు చెందిన డి.రాజేశ్, అదే పంచాయతీ చింతలపాడుకు చెందిన ఎస్.సంధ్యశ్రీ ఏడాది కిందట కులాంతర వివాహం చేసుకున్నారు. సంధ్యశ్రీ ఏడు నెలల కిందట గర్భం దాల్చింది. అయితే, నెలలు నిండకుండానే ఆమెకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చేలోగానే ఓ పాప పుట్టింది. మరోపాప అంబులెన్స్‌లో జన్మించింది. ఇద్దరు శిశువులు, తల్లి సంధ్యను ఇల్లెందుకు ఆస్పత్రికి తలరించగా.. గైనకాలజిస్ట్ సోనిక పరీక్షించి.. మొదటి పాప కిలోన్నర, రెండో పాప 800 గ్రాముల బరువు ఉండటంతో ఖమ్మానికి తరలించాలని సూచించారు. 108 ఈఎంటీ రేణుకదేవి, పైలట్ వేణుకుమార్ వారిని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ పసుపులేటి, మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ముత్యాలమ్మనగర్ జీపీ పరిధిలోని మణుగూరు శాఖా గ్రంథాలయంలో శనివారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించగా.. వారు పాల్గొని మాట్లాడారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు అలవాటు పడొద్దని, దీంతో జీవితాలు చీకటిమయం కావడంతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని తెలిపారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటి సాధనకు కృషి చేయాలని చెప్పారు. సదస్సులో గ్రంథాలయ నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోర్డు తిప్పేసిన ఆన్‌లైన్ కంపెనీ

బాధితుల ఆందోళనతో వెలుగులోకి స్కీం బాగోతం

ఇల్లెందు: ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.17,500 చెల్లిస్తే రూ.లక్షలు ఆదాయం లభిస్తుందని ఓ ఆన్‌లైన్ కంపెనీ ప్రతినిధులు అమాయకులను సభ్యులుగా చేర్చుకుని నిండా ముంచారు. ఇల్లెందులో ఈ ఆన్‌లైన్ కంపెనీలో చేరి మోసానికి బలైన వారు వందల సంఖ్యలో ఉన్నారు. లాభాలు ఆర్జించవచ్చని నమ్మించిన కొందరు ప్రతినిధులు ఒక్కో సభ్యుడిని చేర్పించారు. వారి నుంచి రూ.17,500 తీసుకున్నారు. రూ.లక్షలు ఆదాయం లభిస్తుందని, ఒక దఫా రూ.17,500 చెల్లిస్తే నెలానెలా ఆదాయం ఖాతాలో జమ అవుతుందని నమ్మించారు. గ్రామాల్లో సభలు పెట్టి సభ్యులుగా చేర్పించారు. వారి చెప్పినట్లు డబ్బులు రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వాకబు చేశారు. కొన్ని వాయిదాలు పెట్టారు. అప్పటికి నగదు చెల్లించకపోవడంతో జగదాంబసెంటర్‌లో ఆన్‌లైన్ యాప్ నిర్వహించిన ప్రతినిధి ఇంటికి వెళ్లగా ఆయన పరారయ్యాడు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావటంతో సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది.

జిల్లాస్థాయి పోటీలకు టేకులపల్లి వాసులు


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టేకులపల్లి: మండలానికి చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. సులానగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉపేందర్, చరణ్, సూర్య, మనోజ్, లోకేశ్, లోకేశ్‌కుమార్, ఐశ్వర్య, సిరివెన్నెల, రామ్, ఉపేందర్, గ్రీష్మగాయత్రి, పావని, ప్రణీత, శిరీష, వాసవి, లావణ్య, మాధవి, లాస్య, పల్లవి, శ్రీజ, కుసుమ, ఉదయ్‌భాస్కర్, చరణ్, దీపక్ అక్టోబర్‌లో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గుర్రం దేవదాస్, ఫిజికల్ డైరెక్టర్ మంజీలాల్ తెలిపారు. బొమ్మనపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని బుర్రి జెశ్విత కూడా ఎంపికైనట్లు పీఈటీ సీత వెల్లడించారు.

సీపీఐ జాతీయ మహాసభలకు తొమ్మిది మంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ జాతీయ మహాసభలు ఆదివారం నుంచి ఐదు రోజులపాటు పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్‌లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ మహాసభల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి తొమ్మిది మంది ప్రతినిధులు ఎంపికయ్యారు. వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, సారెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఎస్‌డీ సలీం, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్ ఎంపికైన వారిలో ఉన్నారు. రాష్ట్ర కోటా నుంచి కూనంనేని సాంబశివరావు ప్రతినిధిగా పాల్గొంటారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

బంగారు ఆభరణాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

ఖమ్మంరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను ఖమ్మం సీసీఎస్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీసులు శనివారం పట్టుకున్నారు. రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి వివరాలు వెల్లడించారు. రఘునాథపాలెం మండలం రేగులచెలక గ్రామానికి చెందిన జంగా వెంకన్న, వెల్లబోయిన లక్ష్మణ్‌రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎదురుగడ్డ ప్రాంతానికి చెందిన వల్లపు సంపత్ కలిసి ఓ ముఠాగా ఏర్పడి కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. సీసీఎస్, సివిల్ పోలీసులు సంయుక్తంగా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఖమ్మంరూరల్ మండలం కామంచికల్, గొల్లగూడెం, మద్దులపల్లి, నేలకొండపల్లి, ఖానాపురం, కల్లూరు, రఘునాథపాలెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి 190 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.20 లక్షలు ఉంటుందని ఏసీపీ వివరించారు. రూరల్ సీఐ రాజు ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పాల్వంచరూరల్: పది రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు కనిపించకుండాపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దంతలబోరు గ్రామ పంచాయతీ గంగదేవిగుప్ప గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న కుంజా రామకృష్ణ (28) ఈ నెల 10వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని, తన ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తోందని రామకృష్ణ సోదరి వెంకటరమణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సురేశ్ వెల్లడించారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్టు

కొత్తగూడెంటౌన్: గంజాయి సేవిస్తూ ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం రామవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గరీబ్‌పేట సమీపంలో గంజాయి తాగుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ మనీషా పెట్రోలింగ్ నిర్వహించారు. సమ్మక్క – సారలమ్మ గద్దెల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ప్లాస్టిక్ కవర్లతో కనిపించారు. వారిని పట్టుకుని ఎస్‌ఐ మనీషా విచారించగా కొత్తగూడెం ఓల్డ్ డిపో ముర్రేడు వాగు ఏరియాకు చెందిన వెల్డర్ ఎండీ షారుఖ్, లక్ష్మీటాకీస్ ఏరియా నాగయ్యగడ్డ బస్తీకి చెందిన ఆటోడ్రైవర్ కందుల అనిల్ కుమార్‌గా తేలింది. భద్రాచలంలోని చర్ల రోడ్‌కు చెందిన చేపల వ్యాపారి వద్ద నివసించే రమేశ్ వద్ద నుంచి గంజాయి కొన్నారని, గంజాయి తాగుతున్న సమయంలో పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ ప్రతాప్ వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం: ఖమ్మం పాత బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. ఈ నెల 18వ తేదీన జిల్లా ఆస్పత్రిలో కడుపు నొప్పికి చికిత్స చేయించుకున్నట్లు ఆయన వద్ద ఓపీ స్లిప్ లభించగా, దానిపై భద్రుగా పేరు ఉందని తెలిపారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59107, 87125 51370, 87126 59106 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోలీసుల తీరుపై ఎస్పీ ఆగ్రహం?

ఇల్లెందు: స్థానిక డీఎస్పీ కార్యాలయం తనిఖీ చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శుక్రవారం ఇల్లెందు డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేసిన విషయం విదితమే. సబ్ డివిజన్‌కు చెందిన డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలతో సమావేశం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్‌కు చెందిన పలువురు పోలీస్ అధికారులు రాజకీయ నాయకులతో తిరుగుతున్నారని, వారికి ఇచ్చినంత ప్రాధాన్యత సామాన్యులకు ఇవ్వడం లేదని, ఫిర్యాదులతో సామాన్యులు పోలీస్ స్టేషన్‌ల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నెలల తరబడి సామాన్యుల ఫిర్యాదులు తొక్కి పెడుతున్నారని, ఒక పక్షానికి ఇచ్చినంత ప్రాధాన్యత ఇతర పక్షాలు, సామాన్యులకు ఇవ్వడం లేదని అన్నట్లు తెలిసింది. పలు ఫిర్యాదులపై స్వయంగా వాకబు చేసి, వాటిపై వివరణ కోరినట్లు విశ్వసనీయ సమాచారం. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం.

కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ పరిశీలన

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని సింగరేణి జేవీఆర్ ఓసీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను సింగరేణి డైరెక్టర్ ఎం.తిరుమల్‌రావు పరిశీలించారు. బొగ్గు రవాణా, నిర్వహణలో ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. శైలోర్యాపిడ్ లోడింగ్ సిస్టమ్, డీఎఫ్‌డీఎస్ సిస్టం, విండ్ బ్యారియర్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సింగరేణి డైరెక్టర్ తిరుమల్‌రావును సన్మానించారు. సీహెచ్‌పీ జీఎం రామమూర్తి, పీఓ ప్రహ్లాద్, ఇంజనీర్ సూర్యనారాయణరాజు, సోమశేఖర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.